క్లుప్తంగా

ఎంపీడీఓగా ఉపేంద్రరెడ్డి



కేవీపల్లి : కేవీపల్లె ఎంపీడీఓగా ఉపేంద్రరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న లతీఫ్‌ఖాన్ బదిలీపై కలకడకు వెళ్లారు. ప్రొద్దుటూరులో ఈవోపీఆర్‌డీగా ఉన్న ఉపేంద్రరెడ్డి పదోన్నతి పొంది కేవీపల్లె ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీపీ ఈశ్వరమ్మ స్వాగతం పలికారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

రామసముద్రం: రామసముద్రం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే మూగవాడిలో పని చేస్తున్న వీఆర్‌వో శేఖర్ అంగళ్లకు బదిలీ కాగా పెద్దమండ్యంలో పని చేస్తున్న రఘురాం బదిలీపై చౌడేపల్లెకు వెళ్లారు. చౌడేపల్లెలో పని చేస్తున్న జాన్సన్ ప్రదీప్ రామసముద్రం-1 కు బదిలీపై వచ్చినట్లు తహసీల్దార్ దైవరాజన్ తెలిపారు.

పీఆర్ ఇన్‌చార్జి జేఈగా నాగార్జున

పెద్దతిప్పసముద్రం: పంచాయతీరాజ్ మండల ఇన్‌చార్జి జేఈగా రంగసముద్రం సచివాలయంలో పని చేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జునను తాత్కాలికంగా నియమించినట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ రెగ్యులర్ జేఈగా పని చేస్తున్న నిరంజన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

అంకాలమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

పీలేరు రూరల్: పీలేరు పట్టణం అంకాలమ్మ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. ఆలయ చైర్మన్ మాధవరము భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో లెక్కించగా 133 రోజులకుగాను రూ. 1,74,190 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి రవీంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె దేవదాయశాఖ తనిఖీ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, నాగమణి, క్రిష్ణప్ప పాల్గొన్నారు.

హజ్ యాత్రకు 27 మంది ప్రయాణం

మదనపల్లె సిటీ: హజ్.. ఇస్లాం సూచించిన ఐదు మూల సూత్రాల్లో ఐదో సూత్రం. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారైనా పవిత్ర మక్కా మదీనా పుణ్యక్షేత్రాలను సందర్శించాలని ఇస్లాం ప్రభోదిస్తుంది. ఇందులో భాగంగా సోమవారం మదనపల్లె పట్టణం నుంచి 27 మంది హజ్‌యాత్రకు బయలుదేరారు. వీరు మదనపల్లె నుంచి బస్సులో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. మొదట స్థానిక జామియా మసీదులో ఉదయం నమాజ్ అనంతరం హజ్ యాత్రికులకు వీరి కుటుంబీకులు, ముస్లిం పెద్దలు వీడ్కోలు పలికారు. హజ్‌కు వెళ్లే యాత్రికుల యాత్రను ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

కేవీపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం, మహల్‌రాజుపల్లెలో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చిన్న తనం నుంచే వారిలో చురుకుదనం, ఎదుగుల వుండేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ ద్వారా పిల్లలు మెటీరియల్స్, సులభతరంగా విద్య నేర్పించనున్నట్లు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

పెద్దమండ్యం: నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్‌వోపల్లె క్రాస్ వద్ద నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌వోపల్లె తండాకు చెందిన శిద్దేనాయక్ (28), రాజునాయక్ (29) లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కామేశ్వరుడికి క్షీరాభిషేకం

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ కామేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం కామేశ్వర స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామికి అర్చన, జలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోనవరపు శీనా స్వామి, భక్తులు పాల్గొన్నారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి డివిజన్ పశుసంవర్థక శాఖ డీడీ వి.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామం ఆచార్ల గొల్లపల్లిలో వైఎస్సార్ పశుబీమా పథకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- 500లకు పైగా సేవలతో సరికొత్త విప్లవానికి నాంది
- రూ.2.81 కోట్లతో ఆరు నూతన సచివాలయాల ప్రారంభం
- ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



తట్టివారిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎంపీపీ రెడ్డెమ్మ తదితరులు

మదనపల్లె : ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందించాలన్న ఆశయంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం మండలంలోని కొత్తవారిపల్లె, సీటీఎం క్రాస్‌రోడ్, దుబ్బిగానిపల్లె, తట్టివారిపల్లె, మాలేపాడు, చీకలబైలు గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.81 కోట్లతో నూతనంగా నిర్మించిన 6 సచివాలయాలు, 1 ఆర్‌బీకే, 1 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను ఎంపీపీ రెడ్డెమ్మ, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రతి పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలతో గ్రామాల స్వరూపాలనే మార్చేశారన్నారు. సచివాలయాల్లో 500లకు పైగా సేవలతో దేశంలోనే సరికొత్త విప్లవానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా యువతకు 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలతో పాటుగా 4 లక్షల పైచిలుకు వలంటీర్ ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడమే కాకుండా గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చారన్నారు. సచివాలయాల్లో అన్నిశాఖల అధికారులను ఒక్కచోటకు చేర్చడం ద్వారా ప్రజల సమస్యలను 72 గంటల్లో పరిష్కరిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చదువు, సంధ్యలేని వారికి జన్మభూమి కమిటీల పేరుతో ఉద్యోగాలు ఇచ్చి గ్రామాల్లో వ్యవస్థలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సర్వనాశనం చేశారన్నారు. నేడు సచివాలయాల్లో కుల,మత, రాజకీయాలకు అతీతంగా ఒక రూపాయి అవినీతికి తావు లేకుండా ప్రజల ముంగిటకే పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. కరోనా కష్టాలు, అప్పుల ఊబిలో రాష్ట్రం ఉన్నప్పటికీ వాటన్నింటినీ అధిగమించి రాష్ట్ర అభివృద్ధిలో జగన్ ముందడుగు వేశారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలందరి ఆశీస్సులు, ఆదరాభిమానాలతో 175కు 175 సీట్లలో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. సచివాలయాల ప్రారంభోత్సవాల్లో భాగంగా సీటీఎం క్రాస్‌రోడ్, దుబ్బిగానిపల్లె, తట్టివారిపల్లెలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బండపల్లిఈశ్వరమ్మ, బండపల్లి వెంకటరమణ, అక్కులప్ప, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశారదమ్మ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, సర్పంచ్ సిద్ధలదీప, వేమారెడ్డి ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు బుడ్డయ్య, గణేష్, దండుకరుణాకర్‌రెడ్డి, వెంకటరమణ, వైస్ ఎంపీపీలు పసుపులేటి డిష్‌రమణ, నందినితాజ్, ఎంపీటీసీలు రెడ్డిరాణి, భారతి, అనసూయ, ప్రియాంక, తట్టినాగరత్నమ్మ, మమత, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, సుబ్రహ్మణ్యం, రాము, మల్లికార్జున, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, పోతబోలు నాగరాజ, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యల పరిష్కారం

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండమీద కమ్మపల్లె గ్రామం అమ్మచెరువుమిట్టకు చెందిన ఎస్.హైదర్‌వలి హైవే నిర్మాణంలో భాగంగా తమ అనుభవంలో ఉన్న పట్టాభూమిలోని ఇంటిని అధికారులు తొలగిస్తున్నప్పటికీ తనకు నష్టపరిహారం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. ఇందిరమ్మ పథకంలో కట్టుకున్న ఇంటికి ఓటీఎస్ పథకం కింద చౌడేశ్వరినగర్-2 సచివాలయంలో రూ.10వేలు చెల్లించి ఒకటిన్నర ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు హక్కుపత్రం ఇవ్వలేదని నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌కు చెందిన ఎస్.సుధ ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో బుగ్గకాలువ చివరికాలువ సరిగ్గా తీయడం లేదని, గడ్డి ఎక్కువగా ఉండటంతో దోమలు అధికంగా ఉన్నాయని ఫాతిమా ఫిర్యాదుచేసింది. రెడ్డీస్‌కాలనీలో స్పీడ్‌బ్రేకర్లు అధికమవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, సప్తగిరినగర్‌లో కాలువ నీళ్లు సక్రమంగా పోవడం లేదని, వైఎస్సార్ జగన్ కాలనీలో వీధిలైట్లు, నీటిట్యాంకులు మంజూరుచేయాల్సిందిగా కోరారు. ఎన్వీఆర్ నగర్‌లో కోతులు, కుక్కలబెడద అధికంగా ఉన్నదని, అవెన్యూరోడ్డులోని జంతువధశాలతో పరిసరప్రాంతాల్లో దుర్వాసన అధికంగా ఉండటమే కాకుండా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆర్.ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల తక్షణమే పరిష్కరించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

– జాయింట్ కలెక్టర్ ఫరహాన్ అహ్మద్ ఖాన్



రిజిస్ట్రేషన్‌లపై అవగాహన కల్పిస్తున్న జేసీ ఫరహాన్ అహ్మద్ ఖాన్

వాల్మీకిపురం: గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తోందని, సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిందని జాయింట్ కలెక్టర్ ఫరహాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని నగిరిమడుగు సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసిన తర్వాత గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి అనే దానిపై డెమో ద్వారా సిబ్బందికి వివరించడం జరిగిందన్నారు. రీ సర్వే వలన ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు తొలుగుతాయని, సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ స్వరూప్ కుమార్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మణంగుట్ట సచివాలయంలో భూమి రిజిస్ట్రేషన్

బి.కొత్తకోట: భూ సర్వే పూర్తయిన గ్రామాల్లోని సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్ట సచివాలయంలో తొలి భూమి రిజిస్ట్రేషన్ జరిగింది. గ్రామానికి చెందిన పూల శివమ్మకు 3.66 ఎకరాల రెండున్న సెంట్ల పొలం ఉంది. ఈ భూమికి తన ఇద్దరు కొడుకులైన పూల రామాంజులు, పూల రాజశేఖర్‌లకు దాన విక్రయంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు నిర్ణయించి సచివాలయానికి వచ్చారు. కార్యదర్శి, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఈశ్వర్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ అశ్వినిలు దాన విక్రయంగా రామాంజులుకు 1.82 ఎకరాల రెండున్న సెంట్లు, రాజశేఖర్‌కు 1.84 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పొలంపొందిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను తహసీల్దార్ రఫీక్ అహ్మద్, సబ్‌రిజిస్ట్రార్ పారసారధి, వీఆర్‌ఓ సంధ్య అందజేశారు.

సమస్యలు తీర్చడానికే 'జగనన్న సురక్ష'



కలకడ: అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలకడ : ప్రతి గడపలోని సమస్యను తీర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన గడువుతో నిమిత్తం లేకుండా అవకాశం ఉన్నవాటిని తక్షణం మంజూరు చేయడానికి, కనీసం రుసుం కూడా లేకుండా అర్హతకలిగిన వారికి ఉచితంగా ధ్రువపత్రాలను మంజూరు చేయాలన్నారు. జూలై 1 నుంచి 29వ తేదీ వరకు మండలంలోని 12 సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించాలన్నారు. సమస్యలను ప్రత్యేక యాప్‌ద్వారా కానీ, రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. మండల టీంలో తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీలేరు: జగనన్న సురక్ష పథకంతో ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి, ఉప తహసీల్దార్ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ఈనెల 23 నుంచి వచ్చేనెల 23 వరకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లోని ప్రతి వలంటీర్ తన పరిధిలో ఉన్న కుటుంబాల్లో నెలకొన్న సమస్యలు, అర్హత ఉండి ఏవైనా ప్రభుత్వ పథకాలు రాకున్నవారు, వివిధ రకాల సర్టిఫికెట్లు కావాల్సిన వారి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో ఏర్పడిన అధికారుల బృందాలు వాటిని సకాలంలో పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకొంటారన్నారు.

పెద్దతిప్పసముద్రం: జగనన్న సురక్ష ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామ వలంటీర్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించామన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు వలంటీర్లు వారి పరిధుల్లో క్లస్టర్ ఇన్‌చార్జితో ప్రతి ఇంటికి వెళ్ళి అర్హులై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోయినా, వేరే ఏ ప్రభుత్వ శాఖ ద్వారా ఎలాంటి అవసరం ఉందో తెలుసుకుని వాటి వివరాలను నమోదు చేసుకుని డీఏకు అందజేస్తారన్నారు. అనంతరం తనతో పాటు తహసీల్దార్ టీం సభ్యులుగా ఏర్పడి ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీలలో ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

పెద్దమండ్యం: జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. ఎంపీపీ జి పూర్ణచంద్రిక అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సత్ప్రవర్తన అవసరం

ములకలచెరువు: రౌడీషీటర్లకు సత్ప్రవర్తన అవసరమని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గాయత్రి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన పలు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను విఘాతం కలిగించరాదని హెచ్చరించారు. వర్గాలను ఏర్పాటు చేసి ఘర్షణలకు కారణమైతే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని చెప్పారు. భూ తగాదాలు, క్రికెట్ బెట్టింగులు, దొంగతనాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని రౌడీషీటర్లకు ఎస్ఐ హెచ్చరించారు.

ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : ప్రభుత్వం అందించే వ్యాధి నిరోధక ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని బొంతలవారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. 10 గ్రాముల కంటే తక్కువగా రక్తం కలిగిన ఆరుగురు గర్భిణులకు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం సాధ్యమని, తల్లిబిడ్డ క్షేమమన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు

కలికిరి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కొనసాగుతున్న ఉద్యోగుల సమస్యలను గుర్తించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని జూనియర్ కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం సీఎం చిత్ర పటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ ప్లకార్డులతో ఆనందం వెలిబుచ్చారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

కురబలకోట: గ్రామ వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. సోమవారం పిచ్చలవాండ్లపల్లెలో వలంటీర్లకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అందజేసిన దుస్తులను పంపిణీ చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి వ్యాఖ్యానం చేసేందుకు విచ్చేసిన బ్రహ్మశ్రీ, శివశ్రీ శర్మస్వామికి శివాలయం సేవకులు ననగరం పట్టాభి రామయ్య, ఆకుల మల్లికార్జునలు స్థానిక బస్టాండ్ నుంచి ఆలయం వరకు మేళ తాళాలతో ఘనంగా స్వాగతించారు. కార్యక్రమం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

పీలేరు రూరల్: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని పీలేరు జెడ్పీటీసీ కె.టి.రత్నశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక లక్షిపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదుకోవాలన్న లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విద్యాకానుకను అందజేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి పథకం కింద డబ్బులు జమచేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలియజేయాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: ఏపీ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాయి. ఎంతమేరకు ప్రభుత్వం నుంచి ప్రజలు లబ్ధి పొందారో తెలియజేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామాపురం, బోడుమల్లువారపల్లె, వంకాయలవారిపల్లె గ్రామాల్లో గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించారు. రామాపురం కస్పాలో పాత ఇనుప విద్యుత్ స్తంభాలు చాలా ఏళ్లుగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. రామాపురం కాలనీలో చాలా ఏళ్లుగా మురుగునీటి కాలువలు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే కాలువ నిర్మాణాలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్ స్వామిని ఎమ్మెల్యే ఆదేశించారు. బదిలీపై వెళ్లిన వీఆర్వో తమకు పనులు చేసి పెడతామంటూ మా దగ్గర డబ్బులు వసూలు చేసుకొని వెళ్లిపోయారంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సంబంధిత వీఆర్వోపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి ఎస్ఐ దిలీప్‌కుమార్ ను ఆదేశించారు. వంకాయల వారిపల్లెలో 15 ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సప్రీమ్‌ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, ఎల్వీ రమణ, చంద్రశేఖర్, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటశివారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురేష్, నీళ్లశ్రీనివాసులు, మండల ఆర్బీకే డైరెక్టర్ రాజారెడ్డి, సర్పంచ్ విశ్వనాథ్, ఎంపీటీసీ యాకూబ్, సరస్వతి పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు: ములకలచెరువు మండలానికి ఎంఈఓ – 2 గా శంకరయ్య నియమితులయ్యారు. వి.కోట మండలం లింగాపురం జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ములకలచెరువు – 2 ఎంఈఓ నియమించారు. గతంలో పెద్దతిప్పసముద్రం మండలంలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు.

ఎంఈవో–2గా నాగసుబ్బరాయుడు

తంబళ్లపల్లె: మండల ఎంఈవో–2గా నాగసుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కన్నెమడుగు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ ఉన్నతిపై ఎంఈవో–2గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధితోపాటు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎంఈవో– 2గా వెంకటలక్ష్మి

వాల్మీకిపురం: వాల్మీకిపురం మండల ఎంఈవో–2గా వెంకటలక్ష్మి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గుర్రంకొండ మండలంలోని టి.పసలవాండ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న వెంకటలక్ష్మి పదోన్నతిపై ఇక్కడికి ఇచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పీలేరు ఇన్‌చార్జ్ ఎంఈవోగా రెడ్డిబాషా

పీలేరు: పీలేరు మండల ఇన్‌చార్జ్ ఎంఈవో–1గా రెడ్డిబాషా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న బాలాజీ నాయక్ బదిలీపై రాయచోటికి వెళ్లారు. ఆయన స్థానంలో కేవిపల్లె ఇన్‌చార్జ్ ఎంఈవోగా పనిచేస్తున్న రెడ్డిబాషా పీలేరు ఒకటవ ఎంఈవోగా సోమవారం బదిలీపై వచ్చారు. పీలేరు–2 ఎంఈవోగా కోటపల్లె బాలికల జెడ్పీహైస్కూల్ హెడ్మాస్టర్ పద్మావతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ ఈఈ వెంకటదాస్

నిమ్మనపల్లె : జగనన్న పక్కా గృహ నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటదాస్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఈఈ రామస్వామిరెడ్డి, ఎంపీడీఓ శేషగిరిరావుతో కలిసి హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణ పనుల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడంలో భాగంగా జగనన్న పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. మండలంలో 2వేలకు పైగా జగనన్న పక్కాగృహాలను మంజూరు చేశామన్నారు. నిర్మాణాలు పూర్తిచేసిన గృహాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయని, వీలైనంత త్వరగా పక్కాగృహ నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సిమెంట్, కమ్మీ, ఇతర గృహనిర్మాణ వస్తువులను తక్కువధరకే అందిస్తోందన్నారు. కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగే కొనసాగితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు నిర్మాణపనుల దశలను, బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. హౌసింగ్ డే నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్‌లలో గృహనిర్మాణాలను పరిశీలించి, మౌలికవసతులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏఈను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ అమరనాథ్, హౌసింగ్ సిబ్బంది అనూష, రవి కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

నిమ్మనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్ తెలుగు ప్రధానోపాధ్యాయులు అంజాద్‌అలీ అన్నారు. సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 2022–23 విద్యాసంవత్సరంలో జరిగిన పదోతరగతి ఫలితాల్లో మండలస్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రభుత్వం మంజూరుచేసిన ప్రోత్సాహక నగదు బహుమతులు పంపిణీ చేశారు. మండలస్థాయిలో 570 మార్కులతో మొదటిస్థానంలో నిలిచిన సి.నిహారిక, పి.ప్రతిభలకు రూ.3వేలు, 569 మార్కులతో రెండోస్థానంలో నిలిచిన డి.శేషాద్రికి రూ.2వేలు, 549 మార్కులతో మూడోస్థానంలో నిలిచిన ఏ.చరణ్‌తేజలకు రూ.1,000లను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. హెచ్‌ఎం శ్రీదేవి కృషిని కొనియాడారు.

వాల్మీకిపురం: విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని చదవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మల అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆణిముత్యాల నగదు కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు దీటుగా తయ్యారవ్వాలని ఆకాంక్షించి ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగమే ఆణిముత్యాలు నగదు కానుక పథకమన్నారు. అలాగే స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు నగదు కానుకలను అందజేశారు.